సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 2 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 361 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 మేర పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
38.3°/12.4°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుముఖం పట్టింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

- ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం



ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలందించి కేటాయించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో చేరుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఐసీడీఎస్ ద్వారా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై(ఎఎస్‌డీజీ గోల్స్) ఐసీడీఎస్ అధికారులతో సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఐసీడీఎస్ పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. భోజనం అనంతరం తప్పనిసరిగా తప్పనిసరిగా వేసి ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను పూర్తి స్థాయిలో చేరుకునేలా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, నోడల్ ఆఫీసర్ గాయత్రి, ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు పాల్గొన్నారు.

తొలిరోజే 86 శాతం పింఛన్ల పంపిణీ



బొంతలపల్లిలో పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్ శివానంద

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' కింద ఇచ్చే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ తొలిరోజు బుధవారం జిల్లాలో జోరుగా సాగింది. జిల్లాలో 2,65,194 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.73,62,76,500 మంజూరు చేసింది. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ తిరిగి తొలిరోజే 2,28,328 మందికి రూ.63,34,27,500 నగదు అందజేశారు. దీంతో జిల్లాలో 86 శాతం పంపిణీ పూర్తయ్యిందని, పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువున్నందున వందశాతం పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

దూరవిద్య ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఎస్కేయూ దూరవిద్య డిగ్రీ, పీజీ (రెగ్యులర్) ఫలితాలను వీసీ రామకృష్ణారెడ్డి బుధవారం విడుదల చేశారు. బీఏ కోర్సుల్లో 47 శాతం, బీకాం 26, బీకాం (కంప్యూటర్స్) 42, ఎంఏ (హిస్టరీ) 42, ఎంఏ (పొలిటికల్ సైన్సెస్) 70, ఎంఏ (సోషియాలజీ)58.33, ఎంఏ (ఎకనామిక్స్) 100, ఎంఏ (ఇంగ్లిష్) 67, ఎంఏ (తెలుగు) 65, ఎంఏ (రూరల్ డెవలప్‌మెంట్) 52, ఎంకాం 81, ఎంబీఏ 66, బీఎల్ఐఎస్సీలో 73 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు www.skucde.com, www.skuniversity.ac.in లో చూడవచ్చు. కార్యక్రమంలో రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, దూరవిద్య డైరెక్టర్ ముని నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు నేటికి వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు - 1, 3, 7 (ప్రణాళిక, ఆర్థిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు గురువారానికి వాయిదాపడ్డాయి. ఒకవైపు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, మరోవైపు పెళ్లిళ్లు, ఇంకోవైపు జాతర్లు ఎక్కువగా ఉండడంతో ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిపోయారు. దీంతో సమావేశాలను గురువారానికి వాయిదా వేశారు. రెండో రోజు జరిగే స్థాయీ సంఘాలు-2, 4, 5, 6(గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలతో పాటే వాయిదాపడ్డ స్థాయీ సంఘాల సమావేశాలు కూడా నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జిల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్ ప్రకటించారు.



సాధారణంగా డీప్ ఫ్రై వంటకం ఏది చేసినా.. మిగిలిన నూనెను మరోసారి వాడుకునేందుకు ప్రయత్నిస్తారు. మిగిలిన నూనెను మళ్లీ మళ్లీ మరిగించి వినియోగించడం వల్ల ఆ వంటకం విషపూరితమవుతోంది. అలాంటి ఆహారం తిన్న వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు కబాబ్, బజ్జీ సెంటర్లలోనూ అయిపోయేదాకా అదే నూనెను వినియోగిస్తున్నారు. ప్రజలు ఇలాంటి నూనెల వినియోగం గురించి నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇలాంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత ఉత్తమం.

మరిగి.. మరిగి.. విషమై

- నూనె పునర్వినియోగం.. హానికరం
- పదే పదే మరిగించిన నూనెలతో ప్రమాదకర జబ్బులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో హోటళ్లలో భారీగా వినియోగం
- నూనెల్లో మోతాదుకు మించి టీపీసీ ఉన్నట్లు నిర్ధారించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం

గరిటెడు నూనె మిగిలిపోతే.. అయ్యో నూనె మిగిలిందే అని గృహిణులు దాన్ని నిల్వ చేసుకుని.. మరోసారి వాడుతుంటారు. ఇక హోటళ్లలో అయితే మిగిలిన నూనెను మరిగించి మరిగించి చివరి చుక్క అయిపోయే వరకూ వదలరు. మరిగించిన నూనెలు విషం కంటే ప్రమాదమనే విషయంపై అవగాహన లేక వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదకర జబ్బులతో చెట్టంత మనుషులు పిట్టల్లా కూలిపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెజారిటీ హోటళ్లలో జరుగుతున్న ఈ తంతు వేలాదిమంది ప్రాణాలకు ముప్పు తెస్తోంది.

టీపీసీ మోతాదుకు మించి

టీపీసీ గురించి చాలామందికి తెలియక పోవచ్చు. దీన్నే టోటల్ పోలార్ కాంపౌండ్స్ అంటారు. ఆహారంలో వాడే నూనెలను పదే పదే మరిగించి వాడటం వల్ల టీపీసీ మోతాదు పెరుగుతుంది. వీటి మోతాదు నూనెల్లో 25 మించి ఉండకూడదు. అంతకుమించి ఉంటే నూనెల్లో టాక్సిన్స్ (విషపదార్థాలు) విడుదల అవుతాయి. ఇటీవల అనంతపురంతో పాటు కొన్ని అర్బన్ ప్రాంతాల్లో ఈ నూనెలను పరిశీలించగా టీపీసీ మోతాదు 35 నుంచి 40 వరకూ ఉన్నట్టు తేలింది. తినే పదార్థాలు రుచికరంగా ఉండొచ్చుగానీ కానీ విషపదార్థాలు శరీరంలో గుట్టలుగా పేరుకుపోతాయన్న విషయం చాలా మందికి తెలియదు.

40 హోటళ్లలో నూనెలకు డబ్బాలు

ఒకసారి వాడిన నూనెను మళ్లీ వాడకుండా.. మిగిలిన నూనెను కొనుక్కునేందుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. ఈ నూనె కోసం తొలుత 40 హోటళ్లలో డబ్బాలు ఏర్పాటు చేస్తున్నారు. లీటర్ రూ.30 చొప్పున కొంటారు. సేకరించిన ఆ నూనెలను బయోడీజిల్‌గా వాడుకుంటారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా విస్తరించి డబ్బాలు పెట్టి సేకరిస్తారు. దీనివల్ల ఆరోగ్యానికి హానిచేసే నూనెలను నియంత్రించడం చేయొచ్చు.

టీపీసీ మోతాదు మించితే వచ్చే ప్రమాదకర జబ్బులు

- తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం
- గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ
- హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం
- గ్యాస్ట్రిక్ డిజార్డర్స్ ఎక్కువగా సోకి పేగులకు దెబ్బ పడుతుంది
- కాలేయ సంబంధిత వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ
- 120 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ మోతాదులో వేడి అయ్యే బంగాళాదుంప చిప్స్ వల్ల ఎక్కువ ప్రమాదం ఉంటుంది
- టీపీసీ వల్ల నూనెలు ట్రైగ్లిజరాయిడ్స్‌గా మారి శరీరానికి హాని చేసే అవకాశం ఉంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హోటళ్లు 700 పైనే

రోజుకు వినియోగమవుతున్న నూనెలు 18,000 లీటర్లు

రోజూ సగటున హోటళ్లలో తింటున్న వారు 1,00,000 మంది

పదే పదే నూనెలు మరిగిస్తూ వాడుతున్న హోటళ్లు 40 శాతం

నూనెలపై విస్తృత ప్రచారం

"ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల టీపీసీ మోతాదుకు మించి వచ్చినట్టు పరిశీలనలో తేలింది. ఈ నూనెలను కొనుక్కునేందుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. 40 హోటళ్లలో డబ్బాలు పెడుతున్నాం. అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. హోటల్ యాజమాన్యాలు సహకరించాలి. పదే పదే నూనెలు వినియోగించకూడదని చెబుతున్నాం.

– చక్రవర్తి, ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కమిషనర్

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

- అంకురార్పణ చేయనున్న అర్చకులు



పట్టణంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం(2వ తేదీన)ఆలయ ప్రాంగణంలో అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి స్వామి ఆశీస్సులు కోరుతూ సూర్యుడు అస్తమించిన తర్వాత అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

నవధాన్యాలతో మొలక..

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక(కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రున్ని ప్రార్థిస్తూ అర్చక బృందం అందులో నీరు పోసి నవ ధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహ వచనం చేస్తారు. అనంతరం అర్చకులు సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు. అర్చక పండితులు రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేలా చూస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు స్వాగతం పలికేందుకు పట్టణంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.



అంకురార్పణంలో కొలువు దీరిన శ్రీవారు (ఫైల్)

అభ్యర్థులకు స్థానాల కేటాయింపు



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు బ్యాలెట్‌లో స్థానాలు



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు బ్యాలెట్‌లో స్థానాలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
కర్నూలు	42,040	19,592	1	61,633
నంద్యాల	38,695	16,230	4	54,929
అనంతపురం	45,659	22,672	10	68,341
శ్రీ సత్యసాయి	29,686	13,620	4	43,310
వైఎస్సార్	52,246	29,063	8	81,317
అన్నమయ్య	14,014	6,574	6	20,594
మొత్తం	2,22,340	1,07,751	33	3,30,124

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
కర్నూలు	2,989	2,402	0	5,391
నంద్యాల	2,806	1,619	1	4,426
అనంతపురం	3,459	2,104	1	5,564
శ్రీ సత్యసాయి	2,277	1,071	0	3,348
వైఎస్సార్	4,390	3,071	0	7,461
అన్నమయ్య	1,326	632	0	1,958
మొత్తం	17,247	10,899	2	28,148

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 49 మంది
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 12 మంది

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ పదవులకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు బ్యాలెట్‌లో క్రమ సంఖ్య (స్థానం)ను ఎన్నికల సంఘం కేటాయించింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పట్టభద్ర ఎమ్మెల్సీకి సంబంధించి మొదటిగా గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభ్యర్థులు, తర్వాత రిజిష్టర్డ్ జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీ అభ్యర్థులు, చివరగా స్వతంత్ర అభ్యర్థులకు క్రమ సంఖ్యను కేటాయించారు. అభ్యర్థుల పేరులోని మొదటి ఆంగ్ల అక్షరాన్ని (ఆల్ఫాబెటికల్) తీసుకుని స్థానాలు కేటాయించారు. ఈ క్రమంలో పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో తొలిస్థానం భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి (టీడీపీ), రెండో స్థానం రాఘవేంద్ర నగురూరు (బీజేపీ), మూడో స్థానం వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), నాలుగో స్థానం ఎస్.మల్లికార్జున (అఖిల భారత కిసాన్ జనతాపార్టీ)కు వచ్చింది. స్వతంత్ర అభ్యర్థులకు ఐదో స్థానం నుంచి 49వ స్థానం వరకు వారి పేరులోని తొలి అక్షరం ప్రకారం స్థానాలు కేటాయించారు.

- ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న 12 మందీ స్వతంత్ర అభ్యర్థులు కావడంతో బ్యాలెట్‌లో వారికి వరుసగా 12 క్రమసంఖ్యలు కేటాయించారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించిన కలెక్టర్, ఎస్పీ



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) విజయవాడలోని తన కార్యాలయం నుంచి ఆర్ఓ, ఏఆర్ఓ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మట్లాడుతూ...ఎన్నికల నియమావళిని ఎవరూ ఉల్లంఘించకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక సారించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్పులు పంపిణీ ప్రారంభమైందని, 8వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. మెటీరియల్ సేకరణ ఈనెల 5వతేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. పీఓ, ఏపీఓ అధికారులకు మొదటి విడత శిక్షణ పూర్తైందని, రెండో విడత శిక్షణ 10న, మైక్రో అబ్జర్వర్లకు ఈనెల 7వ తేదీన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 86 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి తగు చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఎన్నికల విధుల్లో 1,550 మంది..

ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 1,550 మంది అధికారులను, సిబ్బందిని వినియోగించుకుంటున్నామన్నారు. ఇంకా సెంట్రల్ పారామిలటరీ ఫోర్స్ కోరామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, బార్డర్ చెక్ పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం చేస్తామన్నారు. సాయుధ బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రశాంత ఎన్నికల కోసం పకడ్బందీ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, సూపరింటెండెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం ధరించక పోతే చర్యలు

సోమందేపల్లి: సచివాలయ ఉద్యోగులు తప్పక యూనిఫాం ధరించాలని, లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ బసంత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని చల్లాపల్లి, గుడిపల్లి, మాగేచెరువు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. అర్హులందరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులదేనన్నారు. విధుల్లో అలసత్వంగా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పథకాలకు అర్హులు, అనర్హుల జాబితాను సచివాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- ఎమ్మెల్సీ మంగమ్మ సన్మానసభలో ఎమ్మెల్యే శంకరనారాయణ

జగన్ వల్లే బడుగులకు రాజ్యాధికారం



సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు



ఎమ్మెల్సీ మంగమ్మను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదరణతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. బుధవారం పెనుకొండలోని వన్నికా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ అభినందన కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ... బీసీలంటే బ్యాక్‌బోన్ వర్గాలని సీఎం జగన్ చాటారన్నారు. ఈ క్రమంలోనే పార్టీలో, ప్రభుత్వంలోనూ పదవులిచ్చి అందలం ఎక్కించారన్నారు. తాజాగా ఎమ్మెల్సీ సీట్లు కూడా పార్టీ కోసం కష్టపడిన వారికి ఇచ్చి గౌరవించారన్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మకు స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ సీటు ఇవ్వడంతో పాటు ఏకగ్రీవమయ్యేలా చూశారన్నారు. ఇది నిజంగా వెనుక బడిన వర్గాల అభివృద్ధికి సంకేతమన్నారు. అన్ని పదవుల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం ఇస్తూ అగ్రవర్ణాలతో సమానంగా చూస్తున్నారన్నారు. అలాగే సీఎంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందువల్లే ఆయా వర్గాలు వైఎస్ జగన్‌ను దేవుడిలా కొలుస్తున్నాయన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... బీసీల పేరు చెప్పుకుంటూ తిరుగుతున్న చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుని బీసీల ద్రోహిగా మిగిలిపోయారన్నారు. చంద్రబాబును నమ్మడమంటే ఎవరి గుంత వారు తవ్వుకోవడమేనన్నారు.

జగనన్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం..

ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశానన్నరు. కొన్నిరోజులుగా తాను వ్యవసాయానికి పరిమితమైనప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను గుర్తించి ఎమ్మెల్సీని చేశారన్నారు. నమ్మకానికి సీఎం జగన్ నిలువెత్తు నిదర్శనమన్నారు. తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చి గెలిపించిన జగనన్నకు జిల్లా బీసీల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూఖ్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు తయాబ్, రామాంజనేయులు, భాస్కర్ నాయక్, బాబు, సద్దాం, రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, పట్టణ కన్వీనర్ బోయ నరసింహులు, నాయకులు పొగాకు రామచంద్ర, వైశాలి జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చలపతి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, చలపతి, తిరుపాల్ నాయక్, పాదయాత్ర నటేష్, నీరుగంటి వెంకటరమణ, సర్పంచ్‌లు రొద్దం, పరిగి, గోరంట్ల, పెనుకొండ, సోమందేపల్లి నాయకులు పాల్గొన్నారు.

5న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

హిందూపురం: స్థానిక డీబీ కాలనీలోని వాసవీ విన్నర్స్ స్కూల్ వేదికగా 5వ తేదీ జిల్లా స్థాయి ఓపెన్ బాలికల చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అడహాక్ కమిటీ కన్వీనర్ నాగార్జున తెలిపారు. అండర్ 11,1 3, 17 విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ధ్రువీకరణ పత్రంతో పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 91826 11281 నంబర్లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం


కేశవప్ప(ఫైల్)

లేపాక్షి: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన కేశవప్ప (54), మరో ముగ్గురితో కలసి బుధవారం ఉదయం స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో చేపలు పట్టారు. వీటిని రోడ్డు పక్కన ఉంచుకుని శుభ్రం చేస్తుండగా కేశవప్పను వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ఉడాయించడంతో చోళసముద్రం నివాసి ఎస్.మూర్తి ద్విచక్రవాహనంపై వెంబడించాడు. దీంతో బొలెరో డ్రైవర్ తన వాహనంతో ఢీకొనేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి గాయపడిన మూర్తిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతదేహం వెలికితీత


భక్తర్‌వలి (ఫైల్)

పెనుకొండ రూరల్: చేపల వేట కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం పోలీసులు వెలికి తీశారు. పెనుకొండలోని కుమ్మరదొడ్డికి చెందిన భక్తర్‌వలి (42) గత సోమవారం బాబయ్య స్వామి చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజుల గాలింపు చర్యల అనంతరం బుధవారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో పోలీసులు వెలికి తీశారు. మృతుడి భార్య ఆయేషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి బలవన్మరణం

రొద్దం: మండలంలోని ఆర్‌ఎల్ కొత్తూరు గ్రామానికి చెందిన వడ్డే వెంకటరమణ చిన్న కుమారుడు సంతోష్(22) బుధవారం సాయంత్రం ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. కాగా, యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రిమాండ్‌కు విలేకరి

కనగానపల్లి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కనగానపల్లి ఆంధ్రజ్యోతి విలేకరి ఆంజినేయులును పోక్సో చట్టం కింద పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

బాబోయ్.. కీళ్ల నొప్పి!



- పెరుగుతున్న రుమటాయిడ్ అర్థరైటీస్ కేసులు
- జన్యులోపం, వాతావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లే కారణమంటున్న వైద్యులు
- చిరుప్రాయంలోనే ప్రారంభమవుతున్న కీళ్ల నొప్పులు

ధర్మవరం అర్బన్: శరీర బరువును మోయడంలోనూ, కదిలించడంలోనూ కీళ్లే ప్రధానం. అలాంటిది ముప్పై ఏళ్లు కూడా నిండకుండా చాలా మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. కుర్చుంటే నొప్పి, నిల్చుంటే నొప్పి. మెట్లు ఎక్కినా.. దిగినా ఇబ్బంది పడటం. ఒకటా రెండా? ఈ కీళ్ల నొప్పులు ఒక పట్టానా ఉండనీయవు.. ఏ పని చేయనీయవు. చిన్న వయసులోనే కీళ్ల నొప్పులని చెప్పుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రస్తుత జీవన విధానమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ పరిస్థితి ధర్మవరం నియోజకవర్గంలో మరీ ఎక్కువగా ఉంది. ఈ వ్యాధిపై తొలిదశలో అప్రమత్తం కాకుంటే రానున్న కాలంలో పెనుముప్పుగా మారే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అసలు కీళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి?

జన్యుపరమైన లోపాలు, వాతావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామం లేకపోవడమే కీళ్ల నొప్పులకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. గంటల తరబడి కుర్చీలో కుర్చోవడం, నిలబడడం లాంటి ఉద్యోగాలు చేస్తున్న వారిలో మోకాలి చిప్ప మీద తెలియకుండానే ఒత్తిడి పడుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. మోకాలి చిప్ప లోపలి భాగం అరగడం వల్ల నొప్పికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. కుర్చీలో కుర్చున్నప్పుడు గానీ, లేస్తున్నప్పుడు గానీ.. మెట్లు ఎక్కినా.. దిగినా.. ఎత్తైన ప్రదేశాలు ఎక్కాల్సి వచ్చిన ఈ నొప్పి క్రమంగా పెరుగుతూ.. తీవ్ర రూపం దాలుస్తుందంటున్నారు. ఇది కాస్త తర్వాతి రోజుల్లో వెన్ను, తుంటి, భుజాలు, మోచేతులు, మెడ ప్రాంతాలకు వ్యాపించే అవకాశముంటుందన్నారు. ఇలాంటి సమయాల్లో రుమటాలజిస్టును కలసి సరైన చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో కీళ్ల నొప్పి బాధితుల వివరాలు...		
మండలం	నివాసాలు	బాధితుల సంఖ్య
ధర్మవరం టౌన్	35,496	16,963
ధర్మవరం రూరల్	12,795	2,179
బత్తలపల్లి	10,089	1,978
తాడిమర్రి	8,572	1,211
ముదిగుబ్బ	15,531	3,794

సాధారణ సమస్య ఒక్కటే

కీళ్ల నొప్పుల్లో అనేక రకాలు ఉన్నప్పటికీ ఎక్కువ మంది రుమటాయిడ్ అర్థరైటిస్‌తోనే బాధపడుతున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. ఒకప్పుడు వారంలో ఇద్దరు, ముగ్గురు ఈ సమస్యతో వైద్యులను ఆశ్రయించేవారని, ప్రస్తుతం రోజులో ముగ్గురు, నలుగురు చొప్పున చికిత్స కోసం వస్తున్నారన్నారు. జనాభాలో 1.5శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 26,125 మంది రుమటాయిడ్ అర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులోనూ 20 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు వారు ఎక్కువగా ఉంటున్నారని, పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు అంటున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

కీళ్ల దగ్గర నొప్పి, వాపు రావడం, ఉదయం నిద్రలేవగానే 15 నిమిషాల వరకూ కీళ్లు పట్టేయడం జరుగుతుంది. రాత్రిపూట కీళ్ల నొప్పులతో నిద్ర పట్టకపోవడం, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు ఉంటాయి. కీళ్లలో గుజ్జు తగ్గిపోయి వంకరగా మారుతాయి. ఎముకల్లో పటుత్వం (బోన్ డెన్సిటీ) తగ్గి చిన్నపాటి దెబ్బలకే విరిగిపోతాయి. ఈ వ్యాధి ప్రభావం వెన్నుపూస, తుంటి కీళ్లపై అధికంగా ఉంటుంది. అయితే రుమటాయిడ్ అర్థరైటిస్‌కు చికిత్సలో జాప్యం చేస్తే కళ్లు తడారిపోయి చూపు తగ్గిపోతుంది. శరీరంపై దద్దుర్లు వస్తాయి. దగ్గు, ఆయాసంతో బాధపడాల్సి ఉంటుంది. గుండె చుట్టూ నీరు చేరుతుంది. నరాల్లో పటుత్వం తగ్గిపోయి చేతివేళ్లు, కాళ్ల వేళ్లు నల్లబడిపోతాయి. మధుమేహం, రక్తపోటులాగే ఈ వ్యాధిగ్రస్తులకూ గుండె, కిడ్నీ, లివర్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.

చిన్న చిన్న నియమాలతో ఎక్కువ ఫలితాలు

- ఏదైనా పని ఎక్కువ సేపు ఒకే భంగిమలో చేస్తే.. లేచి స్ట్రెచ్చింగ్ లాంటివి చేయాలి.
- ఆరోగ్యకరమైన జీవన విధానాలతో బరువు తగ్గించుకోవాలి.
- శరీరానికి ఎక్కువగా నీటిని అందించాలి. శరీరానికి అవసరమైన నీరు అందకపోతే కార్టిలేజెస్ నుంచి గ్రహిస్తుంది. ఇది ఎముకల అరుగుదలకు కారణమవుతుంది.
- విటమిన్ డి లోపం వల్ల కీళ్ల నొప్పులు వచ్చే ఆస్కారముంది కాబట్టి తరచూ పరీక్ష చేయించుకుని మాత్రలు వాడాలి.
- 'కాల్షియం, విటమిన్ డి' తక్కువైతే ఎముకలు బలహీనపడతాయి. కాబట్టి సరైన సమయంలో సమతుల ఆహారాన్ని తీసుకుంటే మంచిది.

స్టెరాయిడ్స్ వాడటం సరి కాదు



చాలామంది కీళ్ల నొప్పులకు ఆర్‌ఎంపీలను ఆశ్రయించినప్పుడు వారు స్టెరాయిడ్స్ ఇస్తుంటారు. దీని ప్రభావం వల్ల వెంటనే నొప్పి తగ్గినా... తర్వాతి రోజుల్లో దుష్పలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఇది అంత మంచిది కాదు. స్టెరాయిడ్స్‌ను దీర్ఘకాలం వాడడం వల్ల ఊబకాయం, బీపీ, శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఒకటి, రెండేళ్లు మందులు వాడితే సరిపోతుంది. కాల్షియం, విటమిన్–డి ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. కొవ్వు శాతం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తగ్గించాలి. సరైన వ్యాయామం చేయడం ద్వారా రుమటాయిడ్ అర్థరైటిస్ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు.

– డాక్టర్ టీఎం బషీర్, ప్రముఖ మత్తు వైద్యులు, ధర్మవరం

నొప్పి భరించలేం



ప్రస్తుతం నాకు 55 సంవత్సరాల వయసు. పాతికేళ్ల వయసులో ఉన్నప్పుడు నేను న్యాయవాది వృత్తిని చేపట్టాను. వృత్తి పరంగా న్యాయస్థానంలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. దీంతో 40 ఏళ్ల ప్రాయంలోనే నేను కీళ్ల నొప్పి బారిన పడ్డాను. ఈ పరిస్థితి నా ఒక్కనిదే కాదు... నాలా ఎందరో న్యాయవాదులు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అనవసరంగా స్టెరాయిడ్స్ వాడకుండా నిపుణుడైన వైద్యుడి వద్ద చికిత్స తీసుకుంటే మంచిది.

– కేఎం అతావుల్లా, సీనియర్ న్యాయవాది, ధర్మవరం

ప్రాణం తీసిన ఈత సరదా


రఘునాథ

పీలేరు రూరల్ : సరదాగా ఈతకెళ్లి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన టి.నల్లప్ప కుమారుడు రఘునాథ (16) పీలేరులోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ట్రిపుల్–ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని వైవీఆర్ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. బుధవారం స్నేహితులు ఐదుగురితో కలసి గుర్రంవారికుంటకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన రఘునాథ్ నీటిలో దిగిన తర్వాత గల్లంతయ్యాడు. దీంతో సమాచారం అందుకున్న హాస్టల్ వార్డెన్.. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. ఆచూకీ గుర్తించి వెలికి తీసేలోపు బాలుడు మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పావురాల కోసం తన్నుకున్నారు!

కళ్యాణదుర్గం: పావురాల కోసం బుధవారం రాత్రి బంధువుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తూరు గ్రామానికి చెందిన బోయ వెంకటేశులు, గోవిందు, రామకృష్ణ అదే గ్రామానికి చెందిన శివప్ప, హేమంత్, భూపతి బంధువులు. ఇరు కుటుంబాలలో పావురాలు పెంచుకుంటున్నారు. ఇటీవల పావురాలు తారుమారు కావడంతో రోజూ అడ్డోపేర్లు పెట్టుకుని తిట్టుకునేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి వాగ్వాదం చోటు చేసుకుని కొట్టుకున్నారు. దీంతో ఓ వర్గంలోని బోయ వెంకటేశులు, గోవిందు, రామకృష్ణ, మరో వర్గంలోని భూపతికి గాయాలయ్యాయి. ఇరువురూ కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఈఎస్‌ఐ గ్రీవెన్స్‌కు 17 వినతులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐసీ) 72వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 17 వినతులు అందాయి. కార్యక్రమంలో ఈఎస్‌ఐ అనంతపురం బ్రాంచ్ మేనేజర్ కిషోర్‌బాబు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించండి

- పోలైన ప్రతి ఓటూ చెల్లుబాటయ్యేలా చూడాలి
- అధికారులకు డీఆర్‌ఓ కొండయ్య ఆదేశం


వీసీ ద్వారా మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ప్రతి ఓటూ చెల్లుబాటు అయ్యే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని డీఆర్‌ఓ కొండయ్య అధికారులకు సూచించారు. 13న నిర్వహించే పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలు నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోకూడదన్నారు.

నంబర్ మాత్రమే వేయాలి: బ్యాలెట్ పేపర్‌పై 1, 2, 3 అంకెలు మాత్రమే వేయాల్సి ఉంటుందని, అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న బాక్సులో మాత్రమే నంబర్లు వేయాలని ఓటర్లకు తెలియజెప్పాలన్నారు. నంబర్లను అక్షరాల్లో కూడా రాయకూడదన్నారు. బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి గుర్తులు, మార్కులు, వేలిముద్రలు ఉండకూదన్నారు. ఇందులో ఏ ఒక్కటి సరిగా లేకపోయినా ఓటు చెల్లుబాటు కాదన్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా పీఓలు, ఏపీఓలకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సహకరించాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలన్నారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడాలన్నారు.

7వ తేదీలోపు ఓటర్లకు స్లిప్పులు అందించాలి..

ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగని ప్రాంతాల్లోనే ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. 7వ తేదీలోపు ఓటర్లకు స్లిప్పులు అందజేయాలన్నారు. పోలింగ్ రోజున కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, పీఓలు, ఏపీఓలకు భోజన ఏర్పాట్లు, బారికేడ్లు, హెల్ప్‌డెస్క్ కల్పించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను స్థానిక పుట్టపర్తి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్, కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, డీటీ మైనుద్దీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకా రక్షణ

- గాలికుంటు నివారణకు ఉచితంగా టీకాలు
- జిల్లాకు చేరిన 3 లక్షల డోసుల వ్యాక్సిన్
- ఈ నెల 31వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమం


కదిరిలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ కేశవయ్య

పుట్టపర్తి అర్బన్: జిల్లా రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, పాడిపరిశ్రమపై కూడా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మూడేళ్ల నుంచి ప్రకృతి కరుణించడంతో సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. పైగా ఎక్కడ చూసినా పచ్చి మేత దొరుకుతోంది. ప్రభుత్వం 'అమూల్' ద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. దీంతో రైతులంతా ఒకటికి రెండు ఆవులను కొనుగోలు చేశారు. గతంలో మేతలేక గేదెలను అమ్ముకున్న వారు ఇప్పుడు కొత్తగా మళ్లీ కొనుగోలు చేశారు. అయితే పాడిపశువులకు అకస్మాత్తుగా గాలికుంటు వ్యాధి సోకుతుండటంతో పాల ఉత్పత్తి తగ్గిపోతోంది. కొన్నిసార్లు రూ.లక్షల విలువైన పాడిపశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నుంచి రక్షణ కల్పించేందుకు ప్రతి ఆరు నెలలకు ఓ సారి టీకాలు వేస్తోంది. తాజాగా మార్చి 1న జిల్లాలో ప్రారంభమైన ఈ టీకాల కార్యక్రమం నెలంతా కొనసాగనుంది.

జిల్లాకు రూ.2.7 కోట్ల విలువైన వ్యాక్సిన్లు

జిల్లాలో 2.81 లక్షలు పాడి పశువులు, 95 వేల గేదెలున్నాయి. వీటిలో నాలుగేళ్ల వయసు పైబడిన పశువులకు ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తోంది. రూ. 2.7 కోట్ల విలువైన 3 లక్షల డోసుల వ్యాక్సిన్ జిల్లాకు పంపింది. దీంతో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు మార్చి 1 నుంచి 31వ తేదీ వరకూ జిల్లాలోని 66 పశువైద్యశాలలు, 23 గ్రామీణ పశువైద్యశాలల్లో గాలికుంటు నివారణ టీకాలు వేసేందుకు సిద్ధమయ్యారు.

గాలికుంటు వ్యాధి సోకితే...

గాలికుంటు వ్యాధి సోకితే దూడలు చనిపోతాయి. పశువులు తీవ్ర అనారోగ్యానికి గురై రైతులకు నష్టాన్ని కలిగిస్తాయి. ఈ వ్యాధి సోకిన ఆవులు, గేదెల్లో పాల దిగుబడి పూర్తిగా తగ్గి పోతుంది, మేత మేయక నీరసించి పోతాయి. నోటి పుండ్లు వస్తాయి, జొల్లు కారుస్తుంది. దీంతో పశువు కుంటుబడి పాకలకే పరిమితమవుతుంది. ఇక ఎద్దులకయితే నోటి పుండ్లుతో పాటు కాలి గిట్టల మధ్య పగుళ్లు వస్తాయి. పని సామర్థ్యం పూర్తిగా తగ్గి పోతుంది. ఎండకు తట్టుకోలేవు.

ఇబ్బందులు తప్పాయి



గతంలో పశువు గాలికుంటు వ్యాధి బారిన పడితే చికిత్స చేయించేందుకు రైతులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చయ్యేది. ఇప్పుడు ప్రభుత్వమే ఉచితంగా టీకాలు వేయడం వల్ల రైతులకు ఇబ్బందులు తప్పాయి.

– రాజశేఖర్, రైతు, పెదపల్లి, పుట్టపర్తి

పాడి పశువులకు టీకా వేయించాలి



గాలికుంటు వ్యాధి సోకితే పశువుల ప్రాణాలకే ప్రమాదం. అందువల్ల పాడిపశువులున్న రైతులు తప్పకుండా వాటికి టీకాలు వేయించాలి. వెటర్నరీ అసిస్టెంట్లు గ్రామానికే వచ్చి పశువులకు టీకాలు వేస్తారు. ప్రభుత్వం ఇప్పటికే 3 లక్షల డోసుల వ్యాక్సిన్ జిల్లాకు పంపింది.

– సుభదాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

హ్యాండ్‌బాల్ బాలుర జిల్లా జట్టు ఎంపిక

కళ్యాణదుర్గం: జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ బాలుర జిల్లా జట్టును స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పుండరీకాక్ష, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శివశంకర్, త్రోబాల్ సెక్రటరీ రవి, పీడీలు మురళి, తిమ్మరాజు, కుళ్లాయిస్వామి, సెలక్షన్ కమిటీ సభ్యులు అశోక్, మురళీకృష్ణ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 4, 5వ తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాలికల హాకీ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం వేదికగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల హాకీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం ప్రకటించారు. జట్టులో లక్ష్మి, స్వీటి, భానుతేజ, సాయిభవ్య, భావన, మంజూష, మనోజ్ఞ, యమున, మీరాన్‌బీ, మల్లిక, షాలిని, మైథిలి, హైందవి, విష్ణుప్రియ, సౌమ్య, సోనియా, కృతి చోటు దక్కించుకోగా, కోచ్‌గా దేవకి, మల్లేశ్వరి వ్యవహరించనున్నారు. కాగా, టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ హాజరు కానున్నారు.

శంభో శంకర..

ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, చౌకీమఠం పీఠాధిపతి కల్యాణస్వామి, దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని రథంపైకి చేర్చారు. శంఖునాదాలు, డప్పు వాయిద్యాల నడుమ గవిమఠ ఆస్థాన గజలక్ష్మి (ఏనుగు) రథం ముందు నడవగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈశ్వరా.. పరమేశ్వర.. శంభోశంకర అంటూ భక్తజనం ప్రణమిల్లగా రథ చక్రాలు ముందుకు కదిలాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులతో ఉరవకొండ ప్రాంతం కిటకిటలాడింది.

– ఉరవకొండ


చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం, (ఇన్‌సెట్) రథం వద్దకు ఊరేగింపుగా ఉత్సవ విగ్రహం తీసుకొస్తున్న గవిమఠం ఉత్తరాధికారి